సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



'గిరి' దంపతులకు అరుదైన గౌరవం 8లో▸

'గిరి' దంపతులకు అరుదైన గౌరవం దక్కిం ది. ఎర్రకోట వద్ద నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానం అందింది.



చాయ్ తాగాల్సిందే..

ఉదయం లేవగానే ఒక్క టీ కొడితే ఉత్సా హం ఉరకలెత్తుతుంది. ఒత్తిడి దూరమవు తుంది. మనస్సు తేలికవుతుంది. 9లో▸

గరిష్టం/కనిష్టం 32.0/25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడ క్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పంద్రాగస్టు అతిథులు వీరే..

కైలాస్‌నగర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్క రించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆయా జిల్లా కేంద్రాల్లో ఈ నెల 15న నిర్వహించే వేడుకల్లో పాల్గొనే ముఖ్య అతిథుల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వ విప్ గంప గోవ ర్ధన్, నిర్మల్ జిల్లాకు రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాల జిల్లాకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ఎమ్మెల్సీ సుంకరి రాజును కేటాయించింది. వీరు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వ ప్రగతిపై ప్రసంగించనున్నారు. ఉత్తమ సేవ లందించిన వివిధ శాఖల ఉద్యోగులకు ప్రశం సాపత్రాలు అందజేయనున్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న రమేశ్‌రాథోడ్

ఇంద్రవెల్లి: మండలంలోని డోంగర్‌గామ్ గ్రామానికి చెందిన మడావి దేవ్‌రావ్, పెందోర్ బాదు పటేల్‌కు మెరుగైన వైద్యం అందించి చూపు వచ్చేలా చూడాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కోరారు. ఆయన శనివారం డోంగర్ గామ్ గ్రామాన్ని సందర్శించి బాధితులు, గ్రామస్తులతో మాట్లాడారు. హనుమాన్ విగ్ర హం వెండి కళ్లను తీసుకెళ్లిన ఎమ్మెల్యే రేఖానాయక్ తీరు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం భీంరావ్, నాయకు లు మరప రాజు, ఆరెల్లి రాజలింగు, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్ తదితరులున్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

నార్నూర్: విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్య లు తప్పవని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రం లోని సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావే శమై మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి గదులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి సేవల గురించి తెలుసుకున్నారు. స్థానిక వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ.. కొందరు ఆస్పత్రికి వచ్చి అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. దీంతో డీఎంహెచ్‌వో స్థానిక సర్పం చ్ బానోత్ గజానంద్‌నాయక్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఐదు గురు వైద్యులుండాల్సిన ఆస్పత్రిలో ఒకే వైద్యుడు విధులు నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డీఎంవో శ్రీధర్, డాక్టర్ శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్, నాయకులు భిక్షపతి, సయ్యద్‌కాశీం, రాథోడ్ సుభాష్ తదితరులున్నారు.

ప్రవాస్ యోజనకు హాజరైన ఎంపీ సోయం



సమావేశానికి హాజరైన ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్: ఆదిలాబాద్, పెద్దపల్లి, మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన బీజేపీ పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా కేం ద్రంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమా నికి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాయల్ శం కర్ హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్ మాట్లాడారు. పార్టీ సంస్థాగత బలోపేతం, తాజా రాజకీయ పరిస్థితుల గురిం చి నాయకులకు దిశానిర్దేశం చేశారు.

మద్యం షాపులకు 22 దరఖాస్తులు

కైలాస్‌నగర్: జిల్లాలోని మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం జిల్లా వ్యాప్తంగా 22 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 19 దరఖాస్తులు వచ్చాయి. ఉట్నూర్ స్టేషన్ పరిధిలో ఒక దరఖాస్తు వచ్చింది. ఇచ్చోడ స్టేషన్ పరిధిలో రెండు దరఖాస్తులు అందాయి. జిల్లాలో 40 దుకాణాలకు గాను ఇప్పటివరకు 114 దరఖాస్తులు వచ్చాయి. శనివారం సెలవు రోజైనప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

జనంబాట

- నియోజకవర్గాల్లో నేతల కోలాహలం
- పార్టీ టికెట్లపై ఎవరి ధీమా వారిదే..
- అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం
- ఫస్ట్‌లిస్ట్‌లో పేరు కోసం తంటాలు



సాక్షి, ఆదిలాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండ గా రాజకీయ పార్టీల్లో కోలాహలం మొదలైంది. పార్టీ టికెట్‌పై నమ్మకంతో నియోజకవర్గాల్లో పలువురు నేతలు జనంబాట పట్టారు. ప్రజల అండదండ లున్న నేతలకే గ్రేడింగ్ ఆధారంగా టికెట్లు కేటాయి స్తామని అధికార బీఆర్‌ఎస్ అధిష్టానం స్పష్టం చేయ గా నాయకులు జనాలను కలుస్తున్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ పార్టీ ముఖ్యనేతల దృష్టిలో పడేందుకు యత్నిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. కాగా, ఆయా పార్టీలకు సంబం ధించి త్వరలోనే మొదటి జాబితా విడుదలవుతుం దనే సంకేతాలు వస్తుండగా తమ పేరే ఉండాలని కోరుకుంటున్నారు. మొత్తంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ పెరిగింది.

ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి అధికార బీఆర్ ఎస్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న మరోసారి టికెట్ తనకే వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వ పథకాలను జనాల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రంగినేని మనీషా ఇక్కడి నుంచి బీఆర్‌ఎస్ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీ సీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి తమలో ఎవరికి టికెట్ వచ్చినా కలిసే పని చేస్తామని సంకే తాలిస్తున్నారు. మరో పక్క డీసీసీ మాజీ అధ్యక్షుడు భార్గవ్‌దేశ్‌పాండే కూడా టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మరోనేత కం ది శ్రీనివాస్‌రెడ్డి కూడా అధిష్టానం అండదండలు తనకే ఉన్నాయని, టికెట్ రావడం ఖాయమనే ధీమా తో కార్యకర్తలతో కలిసి ముందుకు కదులుతున్నారు. బీజేపీలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినీరెడ్డి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బోథ్ నియోజకవ ర్గంలో అధికార బీఆర్‌ఎస్‌లో మాజీ ఎంపీ గోడం నగేశ్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ టికెట్ కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఈసారి తనకే టికెట్ ఖాయమని చెప్పుకొంటున్నారు. అయితే ఇక్కడ పోటీ తీవ్రంగా ఉండగా అధిష్టానం ప్రజాదరణ ఆధారంగా గ్రేడింగ్ మార్కులు ఎవరికి ఎక్కువ వస్తాయో వారికే టికెట్ కేటాయిస్తామని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో జనంలో ఆదరణ పొందేందుకు నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బీజేపీ నుంచి రాష్ట్ర నాయకులు సాకాటి దశరథ్, అడే మనాజీ, అధ్యాప కుడు బలరాం జాదవ్ టికెట్ కోసం యత్నిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి అడే గజేందర్, వన్నెల అశోక్ ప్రయ త్నిస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి ఎమ్మెల్యే రేఖానాయక్, భూక్యా జాన్సన్ నాయక్, ఆర్టీవో శాఖలో పని చేసి రిటైర్డయిన శ్యామ్ నాయక్, మాజీ ఐఏఎస్ శర్వన్‌నాయక్ తీవ్రంగా యత్నిస్తున్నారు. బీజేపీ నుంచి రాథోడ్ రమేశ్, కాం గ్రెస్ నుంచి భరత్ చౌహాన్, చారులత, వెడ్మ బొజ్జు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆసిఫాబాద్‌లో అధికార పార్టీ నుంచి ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి టికెట్ రేసులో ఉన్నారు. ఇక్కడ ఇతర పార్టీల్లోనూ కొన్ని పేర్లు వినబడుతున్నా పోటీదారు లపై ఇంకా స్పష్టత రావడంలేదు.

ఉద్యమానికి ఉపాధ్యాయుల మద్దతు

బోథ్: బోథ్ డివిజన్ ఉద్యమానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా శనివారం వారు దీక్ష చేపట్టారు. తెలం గాణ ఉద్యమంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారని, ప్రస్తుతం బోథ్ డివిజన్ ఉద్య మానికి కూడా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నా మని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చేపట్టిన దీక్షకు మాజీ ఎంపీ నగేశ్, ఎంపీపీ తుల శ్రీనివాస్ సంఘీభావం ప్రకటించారు. ఈ సం దర్భంగా నగేశ్ మాట్లాడుతూ.. బోథ్‌ను డివిజన్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని కోర తామని చెప్పారు. కాగా, ఉపాధ్యాయుడు రావుల శంకర్ ఉద్యమ నిర్వహణ కోసం రూ.5 వేలు, వేముల చంద్రమోహన్, గంగుల రవి, రఘుపతి, ఇదపు పోశెట్టి, వైద్య సురేశ్ రూ.వెయ్యి చొప్పున అందించారు. కాగా, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సాధన సమితి నాయకులు పేర్కొన్నారు.



శిబిరంలో మాజీ ఎంపీ నగేశ్, ఉపాధ్యాయులు

ఎయిడ్స్ నియంత్రణకు కృషి

ఆదిలాబాద్: ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేస్తున్నా మని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం లో శనివారం అంతర్జాతీయ యువజన దినోత్స వాన్ని పురస్కరించుకొని మారథాన్ రన్ నిర్వహిం చారు. స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ ప్రధాన కూడళ్ల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా నరేం దర్ రాథోడ్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ గూర్చి యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అవగాహన కల్పిం చేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ తరఫున ప్రత్యేక దృ ష్టి సారిస్తున్నామని తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్ వో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మారథాన్ రన్ ప్రారంభిస్తున్న నరేందర్ రాథోడ్

మట్కా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

కైలాస్‌నగర్: జిల్లాలో మట్కాను పూర్తిగా నిర్మూలిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీసీఎస్ ఇన్ స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డీ సాయినాథ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మట్కా స్థావ రాలపై సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్ట్ చేశారు. సాయినాథ్ తెలిపిన వివ రాల ప్రకారం.. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటెండర్ కాలనీలో మట్కా నిర్వహిస్తున్న చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన సయ్యద్ అలీ, దస్నాపూర్‌కు చెందిన ఆంజనేయులును అదుపులోకి తీసుకు న్నారు. అటెండర్స్‌కాలనీకి చెందిన మట్కా ఏజెంట్ ఖలీల్ పరారయ్యాడు. వీరి నుంచి రూ.3,520 నగ దు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖుర్షీద్‌నగర్‌కు చెంది న మట్కా ఏజెంట్ బాబుఖాన్ మట్కా నిర్వహిస్తుం డగా అదుపులోకి తీసుకుని రూ.1,030 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు. బాధ్యత లు స్వీకరించిన తొలిరోజే మట్కా నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసినందుకు ఆయనను ఎస్పీ అభినందించారు.

ఆంధ్రాలో గొర్రెల కోసం గోస

తాంసి: సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం గొల్ల, కురు మలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి అరిగోస పడుతు న్నారు. పలువురు లబ్ధిదారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని భీంపూర్ మండలానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులు ప్రభుత్వం సూచించినట్లు యూనిట్ల గ్రౌండింగ్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృ ష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటకు మూడ్రోజుల క్రితం వెళ్లారు. అధికారులు గొర్రెలు అందించడంలో జాప్యం చేస్తుండగా అక్కడే ఉండి నానా పాట్లు పడ్డారు. అనారోగ్యంతో ఉన్న గొర్రెలు అంటగట్టే ప్రయత్నం చేస్తుండగా ఆవేదన చెందారు. తప్ప నిసరి పరిస్థితుల్లో అధికారులు అందించిన గొర్రెలనే తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. అందులో కొన్ని దారిలోనే చనిపోయే పరిస్థితి ఉందని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యంతో తాము చాలా ఇబ్బందులకు గురయ్యామని వివరించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన మోతేవార్ స్వాతి నిండు గర్భిణి. శనివారం ఉదయం ఆమెకు పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ రాగా అందులో స్వాతిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను నిలిపి ఈఎం టీ సతీశ్ ఈఆర్‌సీసీ శ్రీకాంత్ సలహాతో పురుడు పోశారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు.



పాపను కుటుంబ సభ్యులకు ఇస్తున్న ఈఎంటీ

ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలకు బీ+గ్రేడ్

- ఉత్తర్వులు జారీ చేసిన న్యాక్ డైరెక్టర్
- ఉమ్మడి జిల్లాలోనే అరుదైన గుర్తింపు

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలకు న్యాక్ బీ+గ్రేడ్ కేటాయించింది. ఈ మేరకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) డైరెక్టర్ శనివారం ఉత్త ర్వులు జారీ చేసింది. ఇదివరకు ఈ కళాశాలకు న్యాక్ బీ–గ్రేడ్ ఉండగా మరింత మెరుగైన గ్రేడ్ కోసం కళాశాల న్యాక్‌కు వెళ్లింది. ఇందులో భాగంగా ఈ నెల 27, 28 తేదీల్లో న్యాక్ బృందం కళాశాలను సం దర్శించింది. బృందం చైర్మన్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ (బనారస్ హిందూ యూనివర్సిటీ, వారణాసి), మెంబర్, కోఆర్డినేటర్లు విలాస్ ఎస్.కద్రోల్కర్ (తుం కోర్ యూనివర్సిటీ కర్ణాటక), తమిళనాడులోని నమక్కల్ లయోల కళాశాల ప్రిన్సిపల్ జవియ వేదంతో కూడిన బృందం రెండ్రోజుల పాటు కళాశా లలో పరిశీలన చేపట్టింది. తొలిరోజు కళాశాల సమగ్ర సమాచారాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తిలకించారు. పొలిటికల్ సైన్స్, కామర్స్, ఎక నామిక్స్, టీక్యూఏసీ సెల్ విభాగాలను పరిశీలిం చారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. కళాశాల లెక్చరర్లు, విద్యార్థులతో సమావేశమయ్యారు. సాయంత్రం విద్యార్థులు ప్రద ర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. రెండోరోజు కళాశాలలోని వసతులు, విద్యాబోధ నను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. తాము అధ్యయనం చేసిన అంశాలతో కూడిన నివే దికను సీల్డ్ కవర్‌లో కళాశాల ప్రిన్సిపల్ జలగం అనితకు అందజేశారు. న్యాక్ బృంద పరిశీలన సం తృప్తికరంగా సాగడంతో కళాశాలకు ఏ గ్రేడ్ దక్కు తుందని కళాశాల యాజమాన్యం భావించింది. కాగా, శనివారం ప్రకటించిన గ్రేడ్‌లలో ఈ కళాశా లకు బీ+ గ్రేడ్ దక్కింది. ఈ గ్రేడ్‌తో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఈ కళాశాలకు అరుదైన గౌరవం దక్కింది. ఇప్పటివరకు జిల్లాలోని డిగ్రీ కళాశాలలకు బీ గ్రేడ్ మాత్రమే ఉండగా తొలిసారిగా ఈ కళాశాలకు బీ+ గ్రేడ్ దక్కింది. ఈ గ్రేడ్‌ల ఆధారం గా కేంద్ర ప్రభుత్వం కళాశాల అభివృద్ధి కోసం రూసా పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయించేది. కానీ.. కరోనా సమయం నుంచి ఆ నిధుల కేటాయిం పును నిలిపివేసింది. మెరుగైన గ్రేడ్ దక్కడంపై కళాశాల ప్రిన్సిపల్ జలగం అనిత, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల

నిందారోపణలు సరికాదు

- ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: ఆదివాసీ హక్కుల కోసం నిరంత రం పోరాడుతున్న తనపై తుడుందెబ్బ నాయకు లు నిందారోపణలు చేయడం శోచనీయమని ఎంపీ సోయం బాపూరావు ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం రో జున పార్లమెంట్ సమావేశాలకు వెళ్లకుండా కేస్లా పూర్‌లో జరిగిన ఆదివాసీ కార్యక్రమంలో పాల్గొ న్నానని గుర్తు చేశారు. జాతి కోసం రాజకీయాల కతీతంగా పోరాడుతుంటే తనపై కొందరు ఉద్దేశ పూర్వకంగా ఆరోపణలు చేసి ప్రతిష్టను దిగ జార్చేలా ఆందోళన చేయడం సరికాదన్నారు. ఆదివాసీ మహిళలంటే తనకు దేవతలతో సమా నమని, ఆడబిడ్డలను సోదరీమణుల్లాగా, తల్లిలాగా భావిస్తానని స్పష్టం చేశారు. ఆదివాసీ మహిళలు ఆత్మగౌరవంతో బతకాలని తాను చెప్పానని, మహిళలు వేరేలా భావిస్తే తాను క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కొందరు ఆదివాసీ నాయకులు రాజకీయ పార్టీల తెరవెనుక నుంచి తన ప్రతిష్టను దిగజార్చుతూ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఎందరు ఎన్ని కుట్రలు పన్నినా, తాను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. తాను మాత్రం మహిళా జాతికి ఎప్పుడూ రుణపడి ఉంటానని, మహిళలు వేరే లా భావించకూడదని కోరారు. చివరి శ్వాస వరకు ఆదివాసీ జాతి కోసం పోరాడుతూనే ఉం టానని బాపూరావు స్పష్టం చేశారు.

ఉత్తములకే 'ప్రశంస'

- ఒక్కో శాఖ నుంచి ఒక్కరికే ఛాన్స్
- నూతన ఒరవడికి కలెక్టర్ శ్రీకారం

కైలాస్‌నగర్: 'ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసే ప్రక్రియ విమర్శలకు దారి తీయొద్దు. ఒక్కో ప్రభుత్వ శాఖ నుంచి ఉత్తమ సేవలందించిన ఉద్యోగి లేదా సిబ్బందిలో ఒకరినే ఎంపిక చేసి గౌర వించాలి'.. ఇవి.. ఇటీవల స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షలో కలెక్టర్ రాహుల్‌రాజ్ చేసిన వ్యాఖ్యలు. గతంలో జిల్లా అధికారులు తమ శాఖలో పనిచేసే 10–15 మంది ఉద్యోగులను ఉత్తములుగా పేర్కొం టూ ప్రశంసాపత్రాలు అందించేలా కలెక్టర్‌కు సిఫారసు చేయడమే ఇందుకు కారణమైంది. ఇందు లో ప్రశంసాపత్రాలు అందుకున్నవారిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, విధులకు తరచూ గైర్హాజరయ్యే వారు, ప్రజాసమస్యలను పట్టించుకోనివారు, అధికారులకు వంతపాడేవారు, లంచాలు తీసుకుని ఏసీబీకి పట్టుబడినవారు, రాజకీయ పార్టీలకు అనుబంధంగా పనిచేసే వారు.. ఉండడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో కలె క్టర్ రాహుల్‌రాజ్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో ప్రభుత్వ శాఖ పరిధిలో ఉత్తమ సేవలందించే ఒక్కో ఉద్యోగిని మాత్రమే అవార్డుకు సిఫారసు చేయాలని వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదే శించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ నిర్ణయం సరైందేనని, దీని ద్వారా నిజమైన ఉత్తము లకు గుర్తింపు లభిస్తుందనే అభిప్రాయం ఆయా శా ఖల ఉద్యోగులు, సిబ్బందిలో వ్యక్తమవుతోంది. అ యితే ఈ నిర్ణయం ఎంతవరకు కార్యరూపం దాల్చ నుందో మరో రెండు రోజుల్లో తేలనుంది.

ఉత్సాహంగా యోగాసన ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో శనివారం యోగాసన అసోసియే షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన చిన్నారులు ప్రద ర్శించిన ఆసనాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, పాల్గొన డమే కీలకమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కృషితో యోగాను ఒలింపిక్ క్రీడల్లో కలపడం గొప్ప విషయమని పేర్కొన్నారు. గతంలో యోగాను ఆరోగ్యం, ప్రశాంతత కోసమే చేసే వారని, ప్రస్తుతం యోగా క్రీడల్లో భాగమైందని తెలిపారు. చిన్నారులు జిల్లా స్థాయిలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ సెక్రటరీ కాంతారావు, పెటా సెక్రటరీ స్వామి, యోగా అసోసి యేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి చేతన్, అన్వేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఆసనాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

డీసీఆర్బీ డీఎస్పీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

కైలాస్‌నగర్: డిస్ట్రిక్ క్రైమ్ రికార్డు బ్యూరో (డీసీఆర్బీ) డీఎస్పీగా సీహెచ్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్ ఎస్సైగా పోలీస్‌శాఖలో చేరిన ఆయన 2011లో సీఐగా ఉద్యోగోన్నతి పొం దారు. హనుమకొండ, జమ్మికుంట, హుస్నాబాద్, పాల్వంచ, ఇల్లెందు, కొత్తగూడెం ప్రాంతాల్లో విధు లు నిర్వర్తించారు. ఇటీవల డీఎస్పీగా ప్రమోషన్ పొందిన ఆయన జిల్లా డీసీఆర్బీగా డీఎస్పీగా నియ మితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ డీ ఉదయ్‌కుమా ర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా, 2014లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఏడాది పాటు ఆయన సీఐగా పనిచేశారు. జిల్లాలో ఉన్న పూర్తి రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరిస్తూ జిల్లాకు మంచి పేరు తెచ్చేలా విధులు నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు సూచించారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

'ఎంపీ బాపూరావు క్షమాపణ చెప్పాలి'



రాస్తారోకో చేస్తున్న తుడుం దెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 9న ఇంద్రవెల్లి మండ లం కేస్లాపూర్‌లో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఎంపీ సోయం బాపూరావ్ ఆదివాసీ మహి ళలు, పురుషులను అవమానించే వ్యాఖ్యలు చేశా రని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని ఆదివాసీ పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. ఎంపీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ శనివారం జిల్లా కేం ద్రంలోని కొమరంభీం చౌరస్తాలో ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ ఐదు రోజుల్లోగా క్షమాపణ చెప్పకుంటే ఆదివాసీ మహిళ లతో ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించా రు. కలెక్టర్, ఎస్పీ వెంటనే ఎంపీ సోయం బాపూరావ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనం తరం ఎంపీపై కేసు నమోదు చేయాలని మావల పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసి అనంతరం పోలీసు లకు ఫిర్యాదు చేశారు. తుడుం దెబ్బ నాయకులు పుర్క బాపురావ్, కుమ్ర శ్యాంరావ్, వెట్టి మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, పెందోర్ పుష్ప రాణి, సోయం లలిత తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం తెలుసు..!

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తోంది. ఓటింగ్‌లో కచ్చితత్వానికి వినియోగిస్తున్న వీవీ పాట్‌లపైనా వివరిస్తోంది. ఈవీఎంలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో చెల్లని ఓట్లకు చెక్ పడింది. భారీయెత్తున కాగితం వినియోగమూ తగ్గింది. – సాక్షి, మంచిర్యాల డెస్క్

- ఎన్నికల నిర్వహణలో కీలకం
- చెల్లని ఓట్లకు చెల్లు చీటి
- ఓటింగ్‌లో కచ్చితత్వానికి వీవీ ప్యాట్
- ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓటు కచ్చితత్వం



ఓటు కచ్చితత్వానికి వీవీ ప్యాట్(ఓటరు వెరిఫైయేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) వినియోగిస్తున్నారు. ఓటు వేయగానే ఒక స్లిప్‌పై సీరియల్ నంబరు, అభ్యర్థి పేరు, గుర్తు ప్రింట్ అయి బాక్సులో పడుతుంది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల్లో 315కోట్ల ఓట్లు పోలయ్యాయి.

ఒకే ఎన్నిక.. 25వేల బ్యాలెట్ యూనిట్లు

2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంటు స్థానానికి అత్యధికంగా 185మంది బరిలో నిలిచారు. పార్లమెంటు నియోజకవర్గంలోని 1,788 పోలింగ్ కేంద్రాల్లో మొత్తంగా 25వేల బ్యాలెటింగ్ యూనిట్లు, 2000 కంట్రోల్ యూనిట్లు, 2000 వీవీప్యాట్లు వినియోగించి ఎన్నిక నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 12బ్యాలెట్ యూనిట్లు, ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీ ప్యాట్ అమర్చారు. రికార్డు స్థాయిలో అభ్యర్థులు బరిలో నిలిచినా ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించడం దేశంలోనే ఇది మొదటిసారి.

ఇలా మొదలై..

బ్యాలెట్ బాక్సు, పేపర్ స్థానంలో ఈవీఎం తీసుకు రావడానికి ఎన్నికల సంఘం 1977లో హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)ను సంప్రదించింది. దీంతో 1979లో నమూనా ఈవీఎంను రూపొందించింది. దీన్ని ఎన్నికల సంఘం 1980 ఆగస్టు 6న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించింది. ప్రభుత్వ రంగంలోని మరో సంస్థ బెంగళూర్‌లోని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్(బెల్)తో కలిసి ఈసీఐఎల్ ఈవీఎలను తయారు చేసింది.

వినియోగంలోకి..


1982లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఈవీఎంలను మొదటిసారి వినియోగించారు. కానీ వినియోగానికి సంబంధించి నిర్దిష్ట చట్టం లేకపోవడంతో ఆ ఎన్నికలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఎన్నికల్లో ఈవీఎంల వినియోగానికి సంబంధించి ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పార్లమెంటులో 1989లో సవరించారు. ఆ తర్వాత 1998లో మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లోని 25 శాసనసభ నియోజకవర్గాల్లో ఈవీఎంలను వినియోగించారు. 1999 ఎన్నికల్లో 45 పార్లమెంటరీ స్థానాల్లో, 2000లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 45 అసెంబ్లీ స్థానాల్లో వినియోగించారు. 2001లో తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమబంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఈవీఎంలను ఉపయోగించారు. అప్పటి నుంచి ప్రతీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం ఈవీఎంలనే వినియోగిస్తోంది. 2004లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో దేశంలోని 543 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈవీఎంలు వినియోగించారు.

కలెక్టరేట్లలో అవగాహన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఉన్నాయి. ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో ఈవీఎంలను ప్రదర్శిస్తూ సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.


అవగాహన కల్పించే నమూనా ఈవీఎం

ఎప్పటికప్పుడు మార్పులు


బ్యాలెటింగ్ యూనిట్

ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్ ఉంటాయి. ఐదు మీటర్ల కేబుల్‌తో ఈ రెండింటిని అనుసంధానం చేస్తారు. బ్యాలెటింగ్ యూనిట్‌లో 16 మంది అభ్యర్థుల గుర్తులు, పేర్లుంటాయి. 2006 కంటే ముందు ఎం1, ఆ తర్వాత ఎం2 ఈవీఎంలు ఉండగా.. నాలుగు బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్ఠంగా 64 మంది(నోటాతో కలిపి) అభ్యర్థులు బరిలో ఉన్నా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. 2006 తర్వాత ఎం3 ఈవీఎంలను తయారు చేయగా.. 24 బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్ఠంగా నోటాతో కలిపి 384 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ఎన్నికలు నిర్వహించవచ్చు. ఒకే కంట్రోల్ యూనిట్ అవసరం అవుతుంది.

క్లుప్తంగా

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన శ్రీహరిరావు


మాణిక్‌రావ్ ఠాక్రేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కూచాడి శ్రీహరిరావు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ, జిల్లా ఇన్‌చార్జి పీసీ.విష్ణునాథ్, ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ రోహిత్ చౌదరి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని శనివారం వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో నాయకులు కష్టపడి నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సూచించారని తెలిపారు. పర్యటనలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దశరథ రాజేశ్వర్, నాయకులు అర్జుమాన్‌అలీ తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనాల చోరీ నిందితుల అరెస్ట్

ఎదులాపురం: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ చౌరస్తాలో శనివారం టూటౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన షేక్ సద్దామ్, షేక్ రంజాన్‌ను పట్టుకుని విచారణ చేపట్టారు. ద్విచక్ర వాహన చోరులమని వారు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి టూటౌన్‌కు తరలించారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

టీకాతో గేదె మృతి చెందిందని నిరసన

నిర్మల్‌టౌన్: టీకా వేయడంతో గేదె మృతి చెందిందని జిల్లా కేంద్రంలోని వెటర్నరీ ఆస్పత్రి ఎదుట యజమాని శనివారం నిరసన తెలిపాడు. నిర్మల్ రూరల్ మండలం ముజ్గి గ్రామానికి చెందిన మూడు రేణు రెండు నెలల క్రితం పిల్లల పాల కోసం రూ.50 వేలతో గేదెను కొనుగోలు చేసింది. ఈనెల 8న ఏటువంటి అనుమతి లేకుండా వెటర్నరీ సిబ్బంది టీకా వేశారు. మరుసటి రోజు నుంచి గేదె మేతమేయడం ఆపేసింది. రెండు రోజులుగా రక్తస్రావమై శనివారం మృతిచెందింది. దీంతో గ్రామస్తుల సహాయంతో గేదె కళేబరాన్ని ట్రాక్టర్‌లో వెటర్నరీ ఆస్పత్రి వద్దకు తీసుకువచ్చి నిరసన తెలిపారు. బాధిత రైతుకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెటర్నరీ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రభుత్వం గాలికుంటూ టీకాలను ప్రతీ గేదెకు వేయాలని ఆదేశించిందని, ఆమేరకే టీకా వేశామని తెలిపారు. టీకా కారణంగా గేదె మృతిచెందలేదని తెలిపారు.

'గిరి' దంపతులకు అరుదైన గౌరవం

- ఎర్రకోట వద్ద స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం
- 'భూసంపద రైతు ఉత్పత్తిదారుల సంఘం' పేరిట సేవ చేసినందుకే..


కమల-గణపతిరావు దంపతులు

నార్నూర్: మండలంలోని గుండాల గోండుగూడ గ్రామానికి చెందిన జుగ్నాక గణపతిరావు-కమల దంపతులకు అరుదైన గౌరవం దక్కింది. న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద కేంద్ర ప్రభుత్వం ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వీరికి ఆహ్వానం అందింది. గణపతిరావు-కమల దంపతులు సాధారణ రైతులు. వీరి కి మూడెకరాలుండగా వ్యవసాయం చేస్తూ జీవనా న్ని కొనసాగిస్తున్నారు. వ్యవసాయంలో రైతుల కష్టాలను చూసి ఏదైనా చేయాలని భావించారు. 'భూసంపద రైతు ఉత్పత్తిదారుల సంఘం' ఏర్పాటు చేసి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 350 మంది రైతులను సభ్యులుగా చేర్చుకున్నారు. చైర్మన్‌గా గణపతిరావు మిగతా రైతులతో కలిసి ఒక బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. రైతులకు ఉపయోగకరమైన కార్యక్రమాలు నిర్వహించడంతో కేంద్ర ప్రభుత్వం దృష్టిని ఆకర్షించారు. దీంతో నాబార్డు సంస్థ వీరికి అండగా నిలిచింది. ప్రత్యేక సిబ్బందిని నియమించి సంఘానికి కావాల్సిన ఆధునిక పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, టార్పాలిన్లు, పెట్టుబడి కోసం రుణాలు అందించింది. పండించిన పంటలను మద్దతు ధరతో వి క్రయించే ఏర్పాట్లు చేసింది. దీంతో పంట ఉత్పత్తి దారులుగా మారాలనే గణపతిరావు-కమల దంపతుల కృషి ఫలించింది. పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. దంపతుల సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎర్రకోట వద్ద నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానం పంపింది. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడుతూ.. గిరిజనులు దళారుల చేతిలో మోసపోకుండా రైతులు ఉత్పత్తిదారులుగా మారాలనే ఉద్దేశంతో 'భూసంపద రైతు ఉత్పత్తిదారుల సంఘం' ఏర్పాటు చేశామని చెప్పారు. తాను చైర్మన్‌గా అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయగలిగానని పేర్కొన్నారు. కేంద్రం ఆహ్వానం పంపడం ఆనందంగా ఉందని తెలిపారు.

కడెం, సదర్మాట్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న రాంకిషన్‌నాయక్

కడెం: కడెం, సదర్మాట్ ఆయకట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి జిల్లా పరిశ్రమల శాఖ మాజీ జనరల్ మేనేజర్ జాదవ్ రాంకిషన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో శనివారం మాట్లాడారు. కడెం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, ప్రాజెక్టును పూర్తిగా ఆధునీకీకరించాలని కోరారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ఖానాపూర్ బహిరంగ సభలో ఇచ్చిన హామీ మేరకు సదర్మాట్ బ్యారేజ్ నుంచి ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు.

ఎల్ఐసీని ప్రభుత్వం రంగంలోనే కొనసాగించాలి

- నిర్మల్‌లో ఎల్ఐసీ ఉద్యోగుల 27వ మహాసభలు



27వ మహాసభ సమావేశంలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా నిరంతర పోరాటాల ద్వారా ఎల్ఐసీని ప్రభుత్వం రంగంలోనే కొనసాగేలా కాపాడుకుంటామని యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ అన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కరీంనగర్ డివిజన్ యొక్క 27వ మహాసభలు నిర్మల్ ఆర్కె కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం, దేశంలో పెరిగిపోతున్న నియంతృత్వ పోకడలను నిలువరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం పోరాడుతామన్నారు. కేంద్రంలో బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ విలువల్ని మానవ విలువల్ని తుంగలో తొక్కి రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ప్రధాన వక్త, జోనల్ అధ్యక్షులు సతీశ్ మాట్లాడుతూ పోరాటాల పురిటి గడ్డ అయిన నిర్మల్‌లో కేవలం 21 మంది సభ్యులు ఉన్న ఒక చిన్న యూనిట్ ఇంత పెద్ద సభలను ఇంత గొప్పగా నిర్వహించడం అద్భుతమన్నారు. జోధ్పూర్ కోట చాలా దుర్భేద్యమైనదని ఏ సందర్భంలో కూడా ఆ కోట మీద పూర్తి ఆధిపత్యాన్ని ఎవరు సాధించలేకపోయారని, అలాగే 67 సంవత్సరాలుగా మన యూనియన్ ఆధ్వర్యంలో దుర్భేద్యంగా నిర్మించబడిన ఎల్ఐసీ సంస్థ మరో వందేళ్ల వరకూ పటిష్ఠంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 73 సంవత్సరాలుగా అనేక తరాల దార్శనికులైన నాయకత్వం చూపిన మార్గంలో దేశంలోని ఇతర కార్మిక సంఘాలన్నిటినీ కలుపుకుని ఐక్యంగా పోరాడమే మన ముందున్న కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ సంయుక్త కార్యదర్శి జి తిరుపతయ్య, జోనల్ కోశాధికారి శ్రీనివాసన్, జోనల్ సహాయ కోశాధికారి రాజేష్‌సింగ్, నిర్మల్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్, రాజేశ్వర్‌రెడ్డి, నిర్మల్ యూనిట్ బాధ్యులు రమాదేవి, ప్రవీణ్, కృష్ణం రాజేష్, గౌతమ్, సోమేశ్, అశోక్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

డివిజనల్ నూతన కార్యవర్గని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా వి.వామన్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఏ.రామ్మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.రాజేశం, డి.సూర్యకళ, పి.బసవేశ్వర్, కోశాధికారిగా ఎం .శ్రీలత ఎన్నికయ్యారు.

చెక్‌డ్యామ్‌లో పడి వ్యక్తి మృతి


నారాయణ మృతదేహం

సారంగపూర్: మండలంలోని యాకర్‌పెల్లి గ్రామానికి చెందిన వడ్నాల నారాయణ(57) తాగిన మైకంలో చెక్‌డ్యామ్‌లో పడి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ స్థానికంగా బార్బర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. శనివారం కూడా మద్యం తాగి చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. అయితే పంటపొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు గమనించి అక్కడి చేరుకుని అతన్ని రక్షించడానికి ప్రయత్నించే లోపే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. నారాయణ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్‌తో శనివారం అంకోలి గ్రామపంచాయతీ పరిధి సిరికొండ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (25) మృతి చెందాడు. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. అరుణ్‌కుమార్ జంతువుల వేట కోసం మావల పోలీస్‌స్టేషన్ శివారు ప్రాంతంలోని వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలంలో విద్యుత్ తీగలు అమర్చి ఉండడాన్ని గమనించని అరుణ్‌కుమార్ ప్రమాదవశాత్తు వాటికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వ్యవసాయ పొలం యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి

ఎదులాపురం: అదృశ్యమైన వృద్ధుడు శవమై తేలాడు. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి దికొండవార్ అశోక్ (68) ఈనెల 10న ఇంట్లోంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, శనివారం జైనథ్ మండలం పెండల్‌వాడ వాగులో ఆయన మృతదేహం లభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. శవ పంచనామా నిర్వహించి రిటైర్డ్ ఉద్యోగి దికొండవార్ అశోక్ మృతదేహంగా గుర్తించారు. అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అందించారు.

లాటరీ పేరుచెప్పి బంగారు గొలుసు అపహరణ


బాధితురాలు పెంట పెద్దమ్మ


బైక్‌పై మహిళను ఎక్కించుకుని వెళ్తున్న నిందితుడు

కుంటాల: లాటరీలో రెండు తులాల బంగారం గెలుచుకున్నావని మాయమాటలు చెప్పి.. ఓ మహిళను ఊరి చివరకు తీసుకెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసు తీసుకుని పారిపోయిన ఘటన నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూర్‌లో శనివారం జరిగింది. పోలీసులు, బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెంట పెద్దమ్మ ఇంటికి ఒక వ్యక్తి బైక్‌పై వచ్చాడు. పెద్దమ అంటే ఎవరు అని అడిగాడు. అందుకు ఆమె తానేనని చెప్పింది. దీంతో 'నీవు జియో నెట్‌వర్క్ నుంచి ఎయిర్‌టెల్‌కు మారావా' అని అడిగాడు. అవునని పెద్దమ్మ చెప్పడంతో నెట్‌వర్క్ మారినందుకు లక్కీ లాటరీ తగిలిందని, రెండు తులాల బంగారం గెలుచుకున్నావని చెప్పాడు. దీంతో ఉబ్బి తబ్బిబ్బయిన పెద్దమన్న.. తాను ఏం చేస్తే బంగారం ఇస్తారని అడింది. ఏమీ లేదని రూ.10 ఇవ్వాలని చెప్పాడు. ఏమీ ఆలోచించకుండా పెద్దమ్మ ఇంట్లోకి వెళ్లి రూ.10 అడిగితే రూ.110 ఇచ్చింది. రూ.100 సంతోషంగా ఇస్తున్నానని చెప్పింది. దీంతో ఆ డబ్బులు తీసుకున్న సదరు వ్యక్తి.. మెయిన్ రోడ్డు వద్ద ఆఫీసర్లు ఉన్నారని, తనతో వస్తే బంగారం ఇప్పిస్తానని చెప్పాడు. అందుకు సరే అన్న పెద్దమ్మ.. సదరు వ్యక్తి బైక్‌పై వెళ్లింది. సదరు వ్యక్తి ఊరి చివరన ఉన్న 61 నంబర్ జాతీయ రహదారి వద్ద ఉన్న వాసవీ కళాశాల వరకు తీసుకెళ్లాడు. అక్కడ బైక్ ఆపి.. సమీపంలోని బైక్‌షోరూంలోకి వెళ్లాడు. కాసేపటికి వచ్చి.. పద్దమను ఆమె మెడలో ఉన్న రెండు తులాల గొలుసు ఇవ్వమని అడిగాడు. వెంటనే ఆమె గొలుసు ఇచ్చింది. ఇక్కడే ఉండమని, గొలుసు తూకం వేసుకుని బంగారం తీసుకువస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపైనా సదరు వ్యక్తి రాకపోవడంతో పెద్దమ్మ షోరూంలోకి వెళ్లి అడిగింది. వారు అతనెవరో తమకు తెలియదని చెప్పడంతో మోసపోయానని గ్రహించింది. వెంటనే విలపిస్తూ కుంటాల పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. నిందితుడు బైక్ మహిళను బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్న ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

గూడ్స్ రైలు బోగిలో మంటలు


బోగిలో మంటలు ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

తలమడుగు: గూడ్స్ రైలు బోగీలో మంటలు చెలరేగిన ఘటన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో చోటు చేసుకుంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు బొగ్గు తరలిస్తున్న గూడ్స్ రైలు డోర్లీ సమీపంలోని గేట్ వద్ద నుంచి వెళ్తుండగా బోగిలో మంటలు లేచాయి. అప్రమత్తమైన రైల్వే గార్డ్ వెంటనే గూడ్స్ రైలును నిలిపివేశారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌ఇంజిన్ సకాలంలో చేరుకోగా సిబ్బంది మంటలు ఆర్పివేశారు. రైల్వేగార్డ్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పగా రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బోగిలో మంటలు చెలరేగి గూడ్స్ రైలు నిలిచిపోగా మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న ప్యాసింజర్ రైలును కొద్దిసేపు కోసాయి రైల్వేస్టేషన్‌లో అధికారులు నిలిపివేశారు. మంటలు చల్లార్చిన తర్వాత గూడ్స్ రైలును అధికారులు పంపించారు.

కొలాం సేవా సంఘం అధ్యక్షుడిపై మహిళల దాడి


కాలర్ పట్టుకుని లాక్కెళ్తున్న మహిళలు

కైలాస్‌నగర్: ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడుతున్నాడని ఆరోపిస్తూ ఆదివాసీ మహిళలు శనివారం కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావుపై దాడికి పాల్పడ్డారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొమురంభీంచౌక్ సమీపంలోని ఓ హోటల్‌లో ఉన్నాడనే సమాచారాన్ని తెలుసుకుని పెద్ద ఎత్తున ఆదివాసీ మహిళలు అక్కడికి చేరుకున్నారు. ఎంపీ తమను కించపరిచేలా మాట్లాడుతుంటే ఆయనకు మద్దతుగా ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి ఆగ్రహానికి గురైన మహిళలు ఆయనపై దాడి చేశారు. అక్కడి నుంచి ఆయన చొక్కా పట్టుకుని టూటౌన్ పోలీస్‌స్టేషన్ వరకు లాక్కెళ్లారు. అక్కడ జరిగిన ఘటనపై మరోసారి సోనేరావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే వదిలేసి వెళ్లారు.